క్లుప్తంగా

విస్తృతంగా ఎన్‌సీడీ స్క్రీనింగ్ సర్వే

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పరిధిలో ఇందిరానగర్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం ఎన్‌సీడీ సీడీ సర్వేను ఇంటింటా నిర్వహించారు. ఇటీవల కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఇన్‌టెన్సిఫైడ్ స్పెషల్ ఎన్‌సీడీ డ్రైవ్‌ను ప్రారంభించింది. ఇందులో భాగంగా ఫిబ్రవరి 20వ తేదీ నుంచి మార్చి 31వరకు జరుగనున్న సర్వేలో 30 సంవత్సరాలు అంతకన్నా ఎక్కువ వయసు ఉన్నవారికి స్క్రీనింగ్ సర్వే నిర్వహిస్తున్నట్లు యూపీహెచ్‌సీ వైద్యులు అనూష పేర్కొన్నారు. శిక్షణ పొందిన ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు ఇంటింటికి తిరిగి బీపీ, షుగర్, ఎత్తు, బరువు, సర్వైవల్ క్యాన్సర్ టెస్టులు నిర్వహిస్తున్నారని, స్క్రీనింగ్ చికిత్స, వాటిని సంబంధించిన యాప్‌లో డేటాను అప్‌లోడ్ చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని ఆమె పేర్కొన్నారు.

ధర్నా జయప్రదం చేయండి

మంగళగిరి టౌన్: ప్రజా సమస్యల పరిష్కారానికి ఈనెల 13వ తేదీన ఎంటీఎంసీ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి వీవీ జవహర్‌లాల్ అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్‌లాల్ మాట్లాడుతూ మంగళగిరి ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు పేదలు వివిధ రకాల భూముల్లో నివాసాలు ఏర్పాటుచేసుకుని జీవనం సాగిస్తున్న వారికి అధికారంలోకి రాగానే పట్టాలు ఇస్తామని వాగ్దానం చేశారని, ఆ వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కోరారు. చేనేత కార్మికులకు రూ.24 వేలు సంవత్సరానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు చెంగయ్య, జేవీ రాఘవులు, పిల్లలమర్రి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆటల పోటీలు

మంగళగిరి: ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని 6వ బెటాలియన్‌లో బుధవారం మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. బెటాలియన్‌లో పని చేస్తున్న మహిళా అధికారులు, సిబ్బందితో పాటు ఐజీ కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా అధికారులు, సిబ్బంది ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. బి.రాజకుమారి, ఆరవ బెటాలియన్ కమాండెంట్ కె.నగేష్‌బాబు సమక్షంలో ఆటల పోటీలు నిర్వహించారు. ఆర్ఐ సింహాద్రి నాయుడు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గతమెంతో ఘనం..నేడు శూన్యం!

- సంక్షోభం దిశగా చేనేత పరిశ్రమ
- నేతన్న నేస్తానికి మంగళం
- ఇలా అయితే చేనేత పరిశ్రమ ఊబిలోకే అంటున్న కార్మికులు
- వైఎస్సార్ సీపీ పాలనలో నిర్మాణం పూర్తి చేసుకున్న చేనేత భవన్ ప్రారంభం జరిగేనా?
- ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘం నాయకులు



మంగళగిరిలో పనులు లేక ఖాళీగా వున్న చేనేత మగ్గాలు

మంగళగిరి: ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే చేనేత పరిశ్రమను అభివృద్ధి చేసి మంగళగిరి చేనేతకు ప్రపంచ ఖ్యాతి తెస్తానంటూ ఊదరగొట్టిన నారా లోకేష్ నేడు మంగళగిరి చేనేత పరిశ్రమ వైపు కన్నెత్తి చూడకపోవడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో నిర్మించిన చేనేత భవనాన్ని ప్రారంభించకపోవడం, దుకాణాలు కేటాయించకపోవడంపై దుకాణదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలలో గెలిచి అధికారంలోకి వచ్చిన వెంటనే 200 యూనిట్ల ఉచిత కరెంట్, చేనేత నేస్తం అందరికీ అమలు, జీఎస్టీ రద్దు, సహకార సంఘాలకు రూ.156 కోట్ల నిధులు కేటాయింపు, గత ఏడాది బకాయి వున్న త్రిఫ్ట్ ఫండ్ కింద నిధులు కేటాయింపు అంటూ ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చకపోవడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలో స్వర్ణయుగం..

వైఎస్సార్ సీపీ పాలనలోనే చేనేతలకు స్వర్ణయుగమైంది. రూ.కోట్లతో పాతబస్టాండ్ సెంటర్‌లో చేనేత భవనం, రూ.5కోట్లతో చేనేత మగ్గాలు, మంగళగిరి ముఖద్వారం వద్ద నేతన్న విగ్రహం, ప్రకాశం బ్యారేజీ వద్ద నేతన్న విగ్రహం, 1273 మంది కార్మికులకు వైఎస్సార్ నేతన్న నేస్తం నెలకు రూ.2వేలు ఇలా ఎన్నో పథకాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కింది. నాడు వైఎస్సార్ సీపీ పాలనలో అనేక సంక్షేమ పథకాలు అందుకున్న నేతన్నలు.. నేడు ప్రభుత్వ చేయూత లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంక్షోభం దిశగా చేనేత పరిశ్రమ వెళ్తోందని కార్మిక సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దొంగ హామీలతో మోసపోయాం



టీడీపీ ఎన్నికలలో ఇచ్చిన దొంగ హామీలతో మోసపోయి ఓట్లేశాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాలతో పాటు వైఎస్సార్ నేతన్న నేస్తంతో నెలకు తప్పనిసరిగా రూ 2వేలు ఇంటికే పంపేవారు. ఇప్పుడు కూలి కూడా దొరకడం లేదు. చేనేత కూలీల బతుకులు టీడీపీ పాలనలో దుర్భరంగా మారాయి.

– శింగరేసు లావణ్య, మంగళగిరి

చేనేత పరిశ్రమను ఆదుకోవాలి



చేనేత పరిశ్రమ అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు నిధులు కేటాయించాలి. ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, నేతన్న నేస్తం, జీఎస్టీ రద్దు, చేనేత సహకార సంఘాలకు రూ.156 కోట్లు నిధుల కేటాయింపు, తదితర సంక్షేమ పథకాలను అమలు చేసి చేనేత పరిశ్రమను ఆదుకోవాలి.

– పిల్లలమర్రి బాలకృష్ణ, రాష్ట్ర చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి

హామీల ఊసే ఎత్తడం లేదు..



ఎన్నికల్లో ఓట్ల కోసం నాయకులు చేనేత పరిశ్రమను ఉద్ధరిస్తామంటూ అనేక హామీలు ఇవ్వడం అనంతరం వాటి ఊసు ఎత్తకపోవడం పరిపాటిగా మారింది. గతంలో వున్న సంక్షేమ పథకాల అమలుతో పాటు 200 యూనిట్లు ఉచిత కరెంట్, వైఎస్సార్ నేతన్న నేస్తం, జీఎస్టీ రద్దు, సహకార సంఘాలకు నిధులు వెంటనే విడుదల చేసి పరిశ్రమను ఆదుకోవాలి.

– కె.శివదుర్గారావు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు

చైన్ స్నాచర్ అరెస్ట్

రూ.10 లక్షల విలువైన బంగారం, బైక్ స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న నార్త్‌జోన్ డీఎస్పీ మురళీకృష్ణ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్‌లు చేస్తూ పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేసిన ఓ చైన్ స్నాచర్‌ను అరెస్ట్ చేసి బుధవారం కోర్టుకు హాజరు పరిచారు. స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నార్త్‌జోన్ డీఎస్పీ మురళీకృష్ణ వివరాలు వెల్లడించారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాత మంగళగిరికి చెందిన శీలం కమల్, ఇటీవల కొలనుకొండ వద్ద గుంటూరు చానల్ కరకట్టమీద ఉన్న రహదారిలో స్కూటీపై వచ్చి ఓ మహిళ మెడలో బంగారం చైన్‌ను తెంచుకెళ్లాడు. అప్పటి నుంచి సిఐ కల్యాణ్‌రాజు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఖాజావలి, క్రైమ్ సిబ్బంది సురేష్, ప్రసాద్ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి సదరు స్కూటీ నంబర్ ఆధారంగా వివరాలు సేకరించారు. కనకదుర్గ వారధి వద్ద జాతీయరహదారిపై స్కూటీపై సదరు వ్యక్తి వెళుతుండగా అదుపులోకి తీసుకుని విచారించగా అతని పేరు శీలం కమల్ అని, వడ్డేశ్వరం, కొలనుకొండ, గుండిమెడ, కేఎల్‌యూ రహదారిలో చైన్ స్నాచింగ్‌లు చేసినట్లు అంగీకరించినట్లు చెప్పారు. అతడి వద్ద నుంచి రూ.10 లక్షల విలువ చేసే 120 గ్రాముల బంగారం, ఒక స్కూటీని స్వాధీనం చేసుకుని కమల్‌ను కోర్టుకు హాజరుపరిచినట్లు మురళీకృష్ణ తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయం సీఎస్సీ హానర్స్ విభాగానికి చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అగ్ని ప్రమాదాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లను, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్‌రెడ్డిని, ఫీల్డ్ కో–ఆర్డినేటర్ పి.సురేష్‌ను ఇన్‌చార్జి వీసీ డాక్టర్ కె.రాజశేఖరరావు, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకట్రామ్, డీన్ డాక్టర్ హబీబుల్లా ఖాన్ తదితరులు అభినందించారు.

ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి



దీక్ష చేస్తున్న ఏసీసీ కార్మికులు

తాడేపల్లిరూరల్: ఎన్నికలకు ముందు ఏసీసీ కార్మికులకు ఇచ్చిన హామీని నారా లోకేష్ నిలబెట్టుకోవాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కె.ఆదినారాయణతో కలసి సందర్శించి, మద్దతు తెలిపారు. దుర్గారావు మాట్లాడుతూ కోర్టు తీర్పులు కార్మికులకు అనుకూలంగా వచ్చినా యాజమాన్యం బకాయిలు ఇంకా చెల్లించలేదని విమర్శించారు. ఈ విషయంలో మంత్రి నారా లోకేష్ వెంటనే జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎం.ఆశీర్వాదం, ఎం.సాంబశివరావు, నాగేశ్వరరావు, దానయ్య, రమణ, కె.లక్ష్మి, ఇమాంబీ, శివ, సారమ్మ, దుర్గాభవాని, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

తపోకాల దీక్షతో ఆధ్యాత్మిక వికాసం

గుంటూరు మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య



భస్మ విభూదిని పెడుతున్న మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య

ఫిరంగిపురం: ప్రతిఒక్కరూ దేవుడికి సన్నిహితంగా జీవించాలని గుంటూరు మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. మండలకేంద్రంలోని బాల ఏసుదేవాలయంలో భస్మ బుధవారం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన వాక్యోపదేశం చేస్తూ తపస్సు కాల సమయంలో దేవుడికి సన్నిహితంగా ఉండవచ్చని చెప్పారు. గతేడాది మానికొమ్ముల ఆదివారం నాడు ప్రదక్షిణగా తీసుకొచ్చిన తాళపత్రాల బూడిదను ధరించడం.. చీకటిలో ఉన్న మానవుడు వెలుగులోకి వచ్చాడనేందుకు సూచనఅన్నారు. 40 రోజుల తపోకాల దీక్షతో ఆధ్యాత్మిక వికాసం కలుగుతుందన్నారు. అనంతరం విభూదిని భక్తులకు అందించారు. ప్రత్యేక దివ్యపూజాబలి నిర్వహించారు. కార్యక్రమంలో బాల ఏసుదేవాలయ విచారణ గురువులు మాలపాటి ఫాతిమా మర్రెడ్డి, ఫాదర్ ఎం.బాలస్వామి, ఫాదర్ విలియమ్స్, సహాయ విచారణ గురువులు ప్రవీణ్‌కుమార్, వి.రవీంద్ర, మఠ కన్యా స్త్రీలు, సొడాలిటీ సభ్యులు, గుడి పెద్దలు, మరియదళ సభ్యులు, కథోలిక క్రైస్తవులు పాల్గొన్నారు.

విద్యార్థినుల క్యాండిల్ ర్యాలీ

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పరిధిలోని టిప్పర్ల బజార్‌లో వున్న కాంద్రు కమల మున్సిపల్ పాఠశాలలో బుధవారం బేటీ బచావో... బేటీ పఢావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాల నియంత్రణ, ఆడపిల్లలను చదివించడం, తల్లిబిడ్డల సంరక్షణ, ఆడపిల్లల రక్షణ, లింగ పక్షపాతానికి వ్యతిరేకంగా లాంటి వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం క్యాండిల్ ర్యాలీని విద్యార్థులతో నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి, పాఠశాల హెచ్ఎం షేక్ దరియావలి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

9న మెగా వైద్యశిబిరం



తాడేపల్లిరూరల్: ఈనెల 9వ తేది ఆదివావారం తాడేపల్లి పట్టణ పరిధిలోని సుందరయ్యనగర్‌లో మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పూర్వపు జిల్లా గవర్నర్ మిరియాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నామని, బీపీ, షుగర్, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేస్తారని తెలిపారు. గుండె సంబంధిత వ్యాధులతో పాటు మహిళలకు సంబంధించిన అన్ని రకాల వ్యాధులు, జనరల్ వ్యాధులకు వైద్యసేవలు పొందవచ్చని పేర్కొన్నారు. ఆయా విభాగాల్లో నిష్ణాతులైన 16 మంది వైద్యులు తమ వైద్యసేవలను అందించనున్నారని, ఈ అవకాశాన్ని తాడేపల్లి పట్టణ వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వైద్యశిబిరానికి ముఖ్య అతిథులుగా లయన్ గాదె శేషగిరి, లయన్ వీవీపీఎస్.ఆంజనేయులు తదితరులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ప్రగతి హైస్కూల్ ఎండీ ఎస్. వెంకటరావు, ఏంటీఎంసీ బాలోత్సవం ప్రతినిధులు గాదె సుబ్బారెడ్డి, కొట్టే కరుణాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చేనేతలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం

మంగళగిరి టౌన్: చేనేతలను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని చేనేత కార్మిక సంఘం కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ చేనేతలకు గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కంటే చంద్రబాబు ప్రభుత్వం ఎక్కువగా ఆదుకుందని శాసనమండలిలో మంత్రి సవిత చేసిన వ్యాఖ్యలు దారుణమన్నారు. గత బడ్జెట్‌లో చేనేత సహకార సంఘాల్లోని కార్మికులకు రూ.5 కోట్లు త్రిఫ్ట్ ఫండ్‌కు కేటాయించడం జరిగిందని తెలియజేశారు. కానీ ఒక్క రూపాయి కూడా కార్మికులకు చెల్లించకుండా రూ.5 కోట్లు ఖర్చు చేసినట్లు శాసనమండలిలో మంత్రి మాట్లాడడం సిగ్గుచేటన్నారు.

ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్



మోరంపూడి(దుగ్గిరాల): రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతులు అందజేయడం జరిగిందని గ్రామ సర్పంచ్ ఇత్తడి రమేష్ తెలిపారు. దుగ్గిరాల మండలంలోని మోరంపూడి గ్రామంలో బాబు జగ్జీవన్‌రామ్ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 1వ తేదీ నుంచి 4వరకు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. మంగళవారం రాత్రి ఫైనల్స్ బాబు జగ్జీవన్‌రామ్, సురేష్ యూత్ జట్ల మధ్య జరగ్గా.. సురేష్ జట్టు విజయం సాధించిందన్నారు. ప్రథమ స్థానం సాధించిన జట్టుకు రూ 20,116 బహుమతి అందజేశామన్నారు. ద్వితీయ స్థానం సాధించిన జట్టుకు రూ 15,116, తృతీయ స్థానం సాధించిన జట్టుకు రూ 10,116 బహుమతులు అందజేశామన్నారు. జి.అనిల్ కుమార్, కొండూరు ముత్తయ్య, కొలకలూరు శ్రీనివాసర శర్మ, ఇత్తడి చంటి, ఎం.గోపి, జి.కుమార్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

మంగళగిరి టౌన్: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం సాగించాలని మంగళగిరి పట్టణ సిఐ డి.వినోద్‌కుమార్ సూచించారు. మంగళగిరి పట్టణ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన ట్రాఫిక్ జరిమానాలు అమలులోకి వచ్చినట్లు పేర్కొన్నారు. వాటన్నింటి గురించి సమగ్రంగా వివరించారు. ఇవేకాక ఐపీసీ, మోటర్ వెహికల్ చట్టాలను అనుసరించి కేసులు నమోదు చేయనున్నామని చెప్పారు. వాహనదారులు వీటిని దృష్టిలో పెట్టుకుని రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ ప్రాణ నష్టం జరగకుండా వాహనాలు నడపాలని సూచించారు. పట్టణ ఎస్ఐ రవీంద్రనాయక్, పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. రులు పాల్గొన్నారు.

కిల్‌కారి సేవలపై అవగాహన అవసరం



ఫిరంగిపురం: గర్భిణులకు కిల్‌కారి(చిన్నారి చిరునవ్వు) సేవలపై అవగాహనకు కృషి చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు అన్నారు. మండలంలోని నుదురుపాడు పీహెచ్‌సీలో ఆరోగ్యసిబ్బందికి ఇమ్యూనైజేషన్‌పై ప్రత్యేక సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓ మహిళ గర్భిణీ అయినప్పటి నుంచి వారి ఇంటికి ఆరోగ్య సిబ్బంది వెళ్లి ఆమె ఆరోగ్య సమాచారం యూవిన్ పోర్టల్‌లో నమోదు చేస్తారని చెప్పారు. అప్పటి నుంచి బిడ్డ జన్మించిన తరువాత ఏడాది వరకు కిల్‌కారి సేవలులో భాగంగా 72 సార్లు ఫోన్లు వస్తాయన్నారు. వాటిలో గర్భిణి ప్రతి నెల తీసుకోవాల్సిన జాగ్రత్తలు గుర్తించి వైద్యురాలు వివరిస్తారని చెప్పారు. ప్రతిసారి వచ్చే ఫోన్లను గర్భిణులు వినేలా చూడాలని దాని ద్వారా తాను పాటించాల్సిన పద్ధతులు, బిడ్డకు సంబంధించి ఆరోగ్య పరిస్థితులు తెలియపరుస్తారని పేర్కొన్నారు. వైద్యులు ఫరీనాబేగం, యానీగ్రేస్, శ్వేత పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



తాడేపల్లిరూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పార్టీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి అన్నారు. నియోజకవర్గ ఐటీ విభాగం అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన గుంటక నితిన్ రెడ్డి బుధవారం వేణుగోపాల సోమిరెడ్డిని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పదవులు పొందిన వారు తమకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వేణుగోపాల సోమిరెడ్డి సూచించారు. అనంతరం వేణుగోపాల సోమిరెడ్డిని నితిన్ శాలువాతో సత్కరించారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు

మంగళగిరి టౌన్: నగర పరిధిలోని హోటళ్లు, వివిధ రకాల దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు. పట్టణ పరిధిలోని పలు దుకాణాలు, హోటళ్లను బుధవారం ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.మోహనరావు తన సిబ్బందితో ఆకస్మిక తనిఖీలు చేశారు. సుమారు 30 దుకాణాల యజమానులకు జరిమానాలు విధించారు. మరోసారి పట్టుబడితే భారీ జరిమానాలు విధిస్తామని అధికారులు హెచ్చరించారు.

మద్యపానం అనర్థాలపై అవగాహన



మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని ఇందిరానగర్ యూపీహెచ్‌సీలో ఎయిమ్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో బుధవారం మద్యం వలన కలిగే నష్టాలు, అనర్థాలపై అవగాహన కల్పిస్తూ దృశ్య రూపకం ప్రదర్శించారు. మద్యం సేవించడం వలన ఆరోగ్యంపై చూపే దుష్ప్రభావాలు, కుటుంబానికి జరిగే నష్టాన్ని తెలియజేస్తూ విద్యార్థులు ప్రదర్శించిన దృశ్య రూపకం ఆకట్టుకుంది. కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ధనస్సు, సైక్రియాట్రిస్ట్ వెంకటాచలం మాట్లాడుతూ మద్యం సేవించడం వలన ఆరోగ్యం దెబ్బతింటుందని, మద్యం ఎలా మాన్పించాలో వివరించే పునరావాస కేంద్రం అందుబాటులో ఉందన్నారు. మద్యం సేవించి అనారోగ్యానికి గురైన వారికి ఆ కేంద్రంలో చికిత్స నిర్వహిస్తూ కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్, యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ అనూష, ఎయిమ్స్ వైద్యులు నెహమా, నర్సింగ్ ఫ్యాకల్టీ కాశేశ్వరి తదితరులు పాల్గొన్నారు.